రాంగ్ ఎక్స్‌ప్రెస్

రచన:
శ్రీ కే. వీరభద్రరావు, బి.ఎ. బియిడి.

"రైట్, రైట్" కండక్టరు అరుపుతో బస్సు బయలు దేరింది. "ఎవరండీ, ఇంకా టిక్కట్టు తీసుకోవాలి", "బాబూ, కొంచెం లోపలికి జరగండి", "అమ్మా, మీరు అలా తూర్పోండి", "ఏమండీ, మీరు టికెట్ తీసుకున్నారా?" మొదలగు మాటలు కండక్టరు నోటివెంట ధారాళంగా వస్తున్నాయి. సుబ్రమణ్యం కండక్టరు వెనుక సీటులో కూర్చున్నాడు. ప్రక్క స్టేజిలో బస్సు ఆగింది. ఒక యువతి హేండ్ బాగ్‌తో పరిగెత్తుకుంటూ రొప్పుతూ వచ్చి బస్సు ఎక్కింది. బస్సు బయలు దేరింది. సుబ్రమణ్యం ఇవన్నీ చూసే స్థితిలో లేడు. వార పత్రికలో లీనమై పోయాడు. బస్సులో జనము నిశ్శబ్దంగా ఉన్నారు. "వాల్తేరు ఒకటి" ఆ యువతి కండక్టరుతో అంది. సుబ్రమణ్యం అప్రయత్నంగా బుర్ర పైకెత్తాడు. ఆ యువతి హేండ్ బాగ్‌లో చేయిపెట్టి డబ్బులు తీస్తోంది. ముఖము పైకెత్తి ముంగురులు సర్దుకుంది. అపుడు సుబ్రమణ్యం ఆమె ముఖమును చూచాడు. రెప్ప వాల్చకుండా కండ్లు మరింత పెద్దది చేసి మరీ చూశాడు. అనుమానం లేదు, ఆమెయే. చిన్నపుడు తనతో కలసి ఆడుకున్న సుశీలే, ఒక్కసారిగా ఎగిరి గెంతేయాలన్న ఆనందం వేసింది. కాని తనున్న పరిస్థితి అర్థం చేసికొని ఊరుకొన్నాడు. "తనవైపు సుశీల చూడలేదా? ఒకవేళ చూపే మౌనంగా ఉందా? ఛ, చూస్తే తప్పకుండా పలకరిస్తుంది. అరే పాపం సుశీల నిలబడే ఉంది. కూర్చోమని మర్యాద చేయడానికి ఇదేమయినా మన యిల్లా?" యీ విధంగా సాగుతోంది సుబ్రమణ్యం అంతరంగం!

ఇంతలో ప్రక్క స్టేజి వచ్చింది. ఇద్ద రాడవాళ్లు క్రిందకు దిగారు. సుశీల వెళ్ళి ఆ సీటులో కూర్చుని జేబు రుమాలుతో ముఖం వత్తుకుంది. చిన్నప్పుడు కూడ సుశీలకు అంతే. దాగుడు మూతలు ఆడినపుడు ముక్కు మీద, పెదమీద ఎక్కువ చెమట పట్టేది. ముక్కుమీద చెమట యెండలో మెరిస్తే, ముక్కులు మరింత అందం ఇచ్చేది. మెడ కూడ తళతళలాడుతోంది. మెడలో పసుపుత్రాడు ఉండేమిటి? కొంపదీసి పెళ్ళిగాని అవలేదు గదా? మొగుడు ఏమి చేస్తున్నాడో? తనకంటే అందంగా ఉందాడా? పిల్లలు ఎంత మంది? కాని? "ఛ, ఛ! ఇన్ని ఆలోచించక పోతే పెళ్ళి సుశీలనే అడుగరాదా?" అంతరాత్మ ప్రశ్నించింది. అమ్మో ఇంతమందిలో అడగడమే? తన కసలు చిన్నప్పట్నుండీ ఆడపిల్ల లంటేనే భయం! "ఛీ, ఛీ ఆడపిల్లలా బుర్ర వంచుకుంటూ వేమిటి, నేనే మొగాణ్ణయితేనా?" చిన్నపుడు సుశీల అంటూండే మాటలు గుర్తుకొచ్చాయి. తనలో తనే నవ్వుకున్నాడు.

* * *

సుశీల ప్రక్కనున్న ఎవరితోనో మాట్లాడుతోంది. సుశీల ఇంతకు ముందులా లేదు. కొంచెం లావెక్కింది. కళ్ళు కొంచెం లోతుకు పోయినట్లుగా ఉన్నాయి. ఎవడో రౌడీలా ఉన్నాడు. అస్తమానం సుశీలవైపే చూస్తున్నాడు. వెధవ! వాణ్ణి చూస్తుంటే సుబ్రమణ్యానికి నరికేయాలని ఉంది. గాజువాక వచ్చింది. రౌడీ వెధవ, అరు సారిగా సుశీల వైపు చూసి, దిగిపోయాడు. హమ్మయ్య! కనీ చిరగ దయింది. సుశీలకు ఇదేం పట్టినట్లు లేదు; ప్రక్క కూర్చున్న ఆవిడతో ఏదో మాట్లాడేస్తోంది. చిన్నప్పట్నుంచీ సుశీల అంతే! ఎక్కువ వాగుడుకాయ.

టైము రాత్రి ఏడున్నర అయింది. వాల్తేరు బస్సు స్టాండు వచ్చింది. బస్సులో అందరూ దిగుతున్నారు. సుబ్రమణ్యం ఈ విధంగా అనుకుంటున్నాడు. "సుశీల నన్ను గుర్తు పట్టుందో లేదో" తను ఇంతకు ముందు రాలేదు గదా? కొంచెం లావెక్కాడు. పొడుగు కూడా అయ్యాడు. కమల్‌హాసన్ రూపం, రజినీ స్టైలు గెడ్డం ఉంది," సుబ్రమణ్యం సిగరెట్టు అంటించాడు. సుబ్రమణ్యం తన Air Bag తీసుకొని కండక్టరు ప్రక్కకు వచ్చి నిలబడ్డాడు. సుశీలకు కండక్టరు నలభై పైసలు యిచ్చాడు. 'హల్లో' సుశీల పలకరించింది. "హాయ్" సుబ్రమణ్యం విష్ చేశాడు. ఇద్దరూ బస్సు దిగారు. "సుశీలే తనకన్న వయం. ఆడదైనా చూసిన వెంటనే పలకరించింది. తనకన్న సుశీల ఎప్పుడూ వయమే." ఇద్దరూ నడుస్తున్నారు. కొంతసేపు ఇద్దరి మధ్య మౌనం!!

"సుబ్బూ, నీవు ఎక్కడ ఉంటున్నావ్" సుశీల ప్రశ్న.

"ఇక్కడే!"

"ఆ సుశీ, నువ్వు ఇప్పుడు ఏం చేస్తున్నావ్?" తెగించి సుబ్రమణ్యం సుశీలను అడిగాడు.

"జాబ్" సుశీల సింపిల్‌గా చెప్పింది.

"పెళ్ళయిందా?" సుబ్రమణ్యం డౌట్!

"ఆ, అయ్యింది" సుశీల సమాధానం।

సుబ్రమణ్యం ఖంగుమన్నాడు. అయితే తను చూసింది నిజమే నన్నమాట।

"పిల్లలు।"

"లేదు।" చిన్న చిఱునవ్వు.

ఆ నవ్వులో అనేక భావా లున్నాయి. ఆ భావాల వెనుక అనేక గాధ లున్నాయి. కాని, ఆ భావాలను అర్థం చేసుకొనే శక్తి, ఆ గాధలను ఊహించే తెలివి సుబ్బు ఉరఫ్ సుబ్రమణ్యానికి లేవు.

"మీ ఆయన ఏం చేస్తుంటాడు? సుబ్బు ప్రశ్న.

"హోం డిపార్ట్‌మెంట్‌లో సూపర్ వైజర్" సమాధానం.

సుబ్రమణ్యానికి అర్థం కాలేదు. కాని తిరిగి అడగలేదు. ఇదేం ఉద్యోగంరా బాబు అని మాత్రం అనుకున్నాడు.

"సుశీ! కాఫీ త్రాగుదాం రా।" లెగించి అన్నాడు. ఇద్దరూ కలసి RTC కెంటీన్ వైపు వెళ్ళారు. సుశీల, సుబ్బుకు ఎదురుగా నున్న కుర్చీలో కూర్చుంది. హేండ్ బాగ్ ప్రక్క కుర్చీలో పెట్టింది.

"విజృంభణ" చిత్రంలో జయసుధ.

సుశీ! 10th Pass అయ్యాక, ఇంటర్ ఎక్కడ చదివావు?"

ఏం మాట్లాడాలో తెలియక సుబ్రమణ్యం సుశీలను అడిగాడు. సుశీల గట్టిగా నిట్టూర్చింది. ఆ నిట్టూర్పు వెనుక ఒక గాధ ఉంది. ఆ గాధను తెలుసుకోవాలని సుబ్బు కుతూహలంతో ఉన్నట్లుగా సుశీల గ్రహించింది. చెప్పడానికి ఉపక్రమించింది.

"10th Pass అయిన తర్వాత కాలేజీలో చేరుదామని అనుకున్నాను. కానీ మా నాన్నగారు ఆ రోజుల్లోనే పోయారు. ఉన్న పొలమూ కాస్తా అమ్మేసి, మేము వైజాగ్ వచ్చేశాము. నేను అపుడు టైపు, షార్టుహాండ్ నేర్చుకుంటూ, ఇంటర్ ప్రైవేట్‌గా కట్టాను. ఇంటర్ పాసయ్యేసరికి టైపు, షార్టుహాండ్ కూడా పాస్ అయ్యాను. ఉద్యోగం కోసం ఎక్కని గుమ్మం లేదు. ఎక్కడ చూసినా No Vacancy బోర్డులే - ఎదురయ్యేవి. ఇంట్లో గడవడమే కష్టమయ్యేది".....

సుబ్రమణ్యం ఊపిరి బిగపట్టి వింటున్నాడు. ఇంతలో వాళ్ళ సంభాషణకు అంతరాయం కలిగిస్తూ "ఏం కావాలి సార్" అన్న సర్వర్ అరుపు. సుబ్బుకు కోపాన్ని తెప్పించింది. కాని ఏం చేస్తాడు, హోటల్‌కు రావడం దేనికి? "రెండు కాఫీ" అర్డరిచ్చి సుశీలవైపు చూశాడు. మళ్ళీ సుశీల చెప్పడం ప్రారంభించింది.

".....అపుడు ఒక ఆసామీ ఉద్యోగం ఇప్పించాడు.

"సుశీ! నీకు పెండ్లయి ఎన్నాళ్ళయింది।" పిల్లలు యింకా ఎందుకు పుట్టలేదన్న అనుమానంతో అడిగాడు.

"ఉద్యోగం వచ్చినపుడు" సుశీల సమాధానము.

"అయితే ఉద్యోగం వచ్చి నాలుగేళ్ళయిందా?"

"ఊఁ" సుశీల మౌనము.

"మీ ఆయన నిన్ను బాగా చూసుకుంటాడా।" అడిగిన తర్వాత జ్ఞాపకం వచ్చింది. ఇది ఒక చచ్చు ప్రశ్న అని.

సుశీల సమాధానం ఏం చెప్పలేదు బహుశా ఈ సంభాషణ పెంచడం తనకు యిష్టం లేదులా వుంది. "కాఫీలు యింకా రాలేదేం। చెప్పి అరగంట పైగా అయింది." విసుగుతో సుశీల అంది;

సుబ్బు సుశీలను శల్య పరీక్ష చేస్తున్నాడు. సుశీలకు అది నచ్చినట్లు లేదు. బుర్ర దించుకుంది. ఇంతలో సర్వరు కాఫీలు తెచ్చాడు. ఇద్దరూ కాఫీలు త్రాగారు, సర్వరు ఇచ్చిన బిల్లు సుబ్రమణ్యం తీసుకొన్నాడు.

"సుశీ, మనం యీ ఊళ్ళోనే ఉంటున్నాము. కనుక నీవు మా యింటికి, నేను మీ యింటికి యెపుడయినా

రావచ్చు, ఆఁ! అన్నట్లు నేను అదిగో కనబడుతున్న సందులోనే ఎడంచేతి ప్రక్క రెండవ మేడలో ఉంటున్నాను.'' సుబ్బు చెప్పడం ఆపేడు. అదేమంత పెద్ద ఇంట్రస్టు కావట్లు సుశీల ఊ కొట్టింది. సుబ్బుకు చికాకనిపించింది. సుశీల ఎదో చూస్తోంది.

''సుశీ మీ యిల్లెక్కడ?'' సుబ్బు ప్రశ్న.

పరధ్యానంలో వున్న సుశీల ఒక్కసారి సుబ్బువయిపు చూచి, ''ఆఁ, ఆఁ అదే ఏడ్రస్ రాస్తాను. చిన్న కాగితం వుంటే ఇయ్యి,'' తడబడుతూ చెప్పింది. ఆమె తడబాటుకు సరయిన కారణం సుబ్రమణ్యానికి తెలియలేదు. సుశీల రాసిచ్చిన ఎడ్రస్ ఒకసారి చదివి కాగితం జేబులో పెట్టుకున్నాడు. ఆదివారం నాడు తప్పకుండా వస్తానని చెప్పి (సుశీల రమ్మని చెప్పకపోయినా) ఇంటికెళ్ళి పోయాడు.

* * *

సుబ్రమణ్యం రాత్రి పడుకున్నాడన్న మాటేగాని నిద్ర పట్టలేదు, తెల్లవారితే శుక్రవారం. తను రేపుగాక ఎల్లుండే సుశీల ఇంటికి వెళ్తాడు. తనని సుశీల బాగా ఆదరిస్తుందా! మొగుడికి ఏమని పరిచయం చేస్తుంది. ఫ్రెండ్ అనా! లేక బంధువనా! మొగుడు అపార్థం చేసుకోడు గదా! సుబ్బు మనసులో అనేక ఆలోచనలు!

అనుకున్న ఆదివారం వచ్చింది! సుబ్రమణ్యం పెందలాడే లేచిపోయాడు, కాల కృత్యాలు తీర్చుకొని నీట్‌గా బట్టలు వేసుకొని సెంటుకూడ వ్రాసుకొని ఉదయం తొమ్మిది అయ్యేసరికి రోడ్డుమీద కొచ్చాడు. సుశీల యిచ్చిన ఎడ్రస్ స్లిప్ జేబులో ఉందో లేదో చూసుకొని ఆటో యెక్కాడు. ఉత్తపుడు అయితే ఎంత ఆలస్యం అయినా సిటీ బస్సుకోసం విలబడేవాడు. కానీ ఈ రోజు! .....

ఆటో సుబ్రమణ్యం యిచ్చిన అడ్రస్ ప్రకారం ఒక గుమ్మం ముందు ఆగింది. ఆటో అద్దె చెల్లించి, గుమ్మం లోపికి వెళ్ళాడు. తలుపులు వేసి ఉన్నాయి. మనుషులు ఎవరూ కనబడలేదు. ఒక్కసారి తన పికప్ పర్దుకొని కాలింగ్ బెల్ నొక్కాడు.

ఒక అపరిచిత వ్యక్తి తలుపు తీశాడు.

''వెంకటేశ్వర రావు గారిల్లు యిదేనాండి!'' సుబ్బు అడిగాడు.

''సారీ-సార్! యిది నవాబు గారిల్లు'' అపరిచితుని జవాబు.

సుబ్రమణ్యం సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు. తనేం పొరపాటు బడలేదు కదా! డోర్ నంబరు, వీధి పేరు మార్చి మార్చి చూశాడు. No doubt తను పొరపాటు

TRADE MARK

మన్నికకు, అహ్లాదానికి....

పంజు టెక్స్‌వారి

♦ మాస్టర్ ♦ ఫాంటెక్స్

ఫైన్ బనియన్లనే వాడండి.

ఆంధ్రా మరియు, ఒరిస్సా ఏజెంట్లు:—

దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.

పడలేదు, సుశీల యిచ్చిన యెడ్రస్ ప్రకారమే వచ్చాడు మరి!

సుశీల రాంగ్ ఎడ్రస్ యిచ్చిందా! ఛా రాంగ్ ఎడ్రస్ యివ్వ వలసిన ఖర్మ సుశీలకేం పట్టింది? తను సుశీల ఇంటికి రావడం యిష్టం లేదా! కేంటీన్‌లో బాగానే మాట్లాడిందే! మరి రాంగ్ ఎడ్రస్ యెందు కిచ్చినట్లు? పరి-పరి ఆలోచనలతో సుబ్రమణ్యం యిల్లు చేరుకున్నాడు. రెండు రోజులు సుబ్రమణ్యం జుత్తు పీక్కున్నాడు.

నెల రోజులు గడచాయి. సుబ్రమణ్యం ఫ్రెండ్‌తో కలసి K.G.H.లో పని ఉంటే ఒక రోజు వెళ్ళాడు. ఒక దగ్గర ఒక అవిటి వాడు రెండు చక్రాల బండిలో కూర్చుని ఉన్నాడు. ఆ ప్రక్కనే సుశీల విలబడి ఉంది. తన కళ్ళను తనే నమ్మలేక పోయినాడు. సుశీల ఇక్కడ ఎందుకుంది? ఆ అవిటివాడు సుశీలకు ఏమి అవుతాడు?

ఆశ్చర్యంగా ఆ వంకే చూస్తున్న సుబ్రమణ్యంతో ఫ్రెండ్ కలుగజేసుకొని ''ఆవిడ ఎవరో తెలుసా? Zinc Limited లో Steno గా పని జేస్తోంది. అదిగో ఆ అవిటి వాడు తన భర్త. వాళ్ళు మా యింటి ప్రక్కనే ఉంటున్నారు.

పాపం చాలా అన్యోన్యంగా ఉంటారులే! అప్పుడపుడు K.G.H.కు తీసుకు వచ్చి పరీక్ష చేయిస్తుంది. తప్పనిసరి పరిస్థితులలో అతన్ని పెళ్ళి చేసుకొందిట! మా ఆవిడ ఒకసారి నాతో చెప్పింది.....''

ఫ్రెండ్ యింకా ఏవేవో చెబుతున్నాడు, కాని సుబ్రమణ్యానికి ఆపైన చెప్పే మాటలు వినబడలేదు. కళ్ళ వెంట అశ్రువులు రాలాయి. ఏదో తెలియని బాధ!

తనకి సుశీల రాంగ్ ఎడ్రస్ ఎందు కిచ్చిందో సుబ్రమణ్యానికి ఇప్పుడు బోధ పడింది.